Nityam Nigha 06.09.26_Layout 1 9/6/2026 8:21 AM Page 1

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక



బూర నగేష్ గౌడ్
ఎడిటర్


మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 65 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | ఆదివారం 06.09.2026 | పేజీలు : 8 | వెల : 4/-

గోబల్ లీడర్లలో మోదీ అత్యంత స్ఫూర్తిదాయకం

- బెల్జియం ప్రధాని ప్రశంసల వర్షం



- మోదీ తెలివైన నాయకుడన్న బార్ట్ డె వెవర్
- మోదీతో భేటీ కావడం తనకు లభించిన గౌరవమని వ్యాఖ్య
- విశ్వవేదికపై భారత్ పాత్ర కీలకంగా మారిందన్న బెల్జియం ప్రధాని


2

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..
లష్కరే కమాండర్ హతం



- బుద్గాం జిల్లా యూస్‌మార్గ్‌లో ఎన్‌కౌంటర్
- పాకిస్థాన్‌కు చెందిన లష్కరే కమాండర్ యాసిర్ హతం
- నిఘా సమాచారంతో జాయింట్ ఆపరేషన్ చేపట్టిన బలగాలు
- కొంతకాలంగా యాసిర్ కదలికలపై భద్రతా సంస్థల నిఘా

2



కేటీఆర్‌కు తృటిలో తప్పిన ప్రమాదం..

- కారును ఢీకొట్టిన లారీ



నిత్యం నిఘా, కరీంనగర్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తృటిలో రోడ్డు ప్రమాదం నుంచి బయట పడ్డారు. కరీంనగర్‌కు వెళుతుండగా శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆయన ప్రయాణిస్తున్న కారు పాక్షికంగా దెబ్బతిన్నప్పటికీ, కేటీఆర్‌కు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కరీంనగర్‌లో నిర్వహించ తలపెట్టిన విద్యార్థి, యువజన సదస్సులో పాల్గొనేందుకు కేటీఆర్ శనివారం బయలుదేరారు. మార్గమధ్యలో అలుగునూరు వద్ద ఆగగా, పార్టీ కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడ కార్యక్రమం ముగించుకుని ప్రయాణం తిరిగి ప్రారంభమైన వెంటనే, కారుకు సమాంతరంగా వెళుతున్న ఒక లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు వెనుక భాగంలోని డోర్ తీవ్రంగా దెబ్బతింది. ప్రమాద సమయంలో కేటీఆర్ కారులోనే ఉన్నప్పటికీ, ఆయన సురక్షితంగా బయటపడటంతో పార్టీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నాయి. కేటీఆర్ ప్రయాణాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఇదే మొదటిసారి కాదు. ఈ ఏడాది జులైలో జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ వద్ద ఆయన కాన్వాయ్‌లోని రెండు కార్లు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఆ ప్రమాదంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు గాయాలయ్యాయి.

ఆస్తుల వాటా కోసమే చెల్లిని తరిమేశారు

- కేటీఆర్‌పై సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు



- బీఆర్ఎస్ నేత కేటీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు
- కొండా సురేఖ రాఖీ కడితే గౌరవించాను, అదే నా సంస్కారం అంటూ వ్యాఖ్య
- సొంత చెల్లి రాఖీ కట్టకుండా కేటీఆర్ అమెరికాకు పారిపోయారని విమర్శ
- ఆస్తుల్లో వాటా అడుగుతుందని చెల్లిని తరిమేశారని సంచలన వ్యాఖ్యలు

నిత్యం నిఘా, నకిరేకల్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తూ, మాజీ మంత్రి కొండా సురేఖతో రాఖీ కట్టించుకోవడంపై స్పందించారు. తనకు సంస్కారం ఉందని, అందుకే ఆమెను గౌరవించి రాఖీ కట్టించుకున్నానని తెలిపారు. కానీ, కేటీఆర్ మాత్రం సొంత చెల్లితో రాఖీ కట్టించుకోకుండా అమెరికాకు పారిపోయారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ విమర్శలను తనదైన శైలిలో తిప్పికొట్టారు. కేటీఆర్‌ను దుర్మార్గుడిగా అభివర్ణిస్తూ, లక్షల కోట్లు దోచుకుని, ఆస్తిలో వాటా అడుగుతుందనే భయంతోనే సొంత చెల్లిని ఇంటి నుంచి.... 2

సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు? - హరీశ్ రావు

- వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- సమస్యలను గాలికొదిలేసి వేడుకలు జరుపుకుంటున్నారంటూ హరీశ్ విమర్శ
- ప్రభుత్వం కుంభకోణాలమయం అయిందని ఆరోపణ



నిత్యం నిఘా, హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల పాలన వేడుకలను జరుపుకోవడంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ముఖం పెట్టుకుని 2



విద్యాశాఖలో కీలక మార్పులు..

టీచర్ల సమస్యలపై సీఎం రేవంత్ హామీ

- పెండింగ్ టీచర్ల పదోన్నతులు పూర్తి చేశామన్న రేవంత్
- బదిలీలపై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామన్న సీఎం
- రెండేళ్లలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ
- సాంకేతిక విద్యకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్న రేవంత్
- పాలిటెక్నిక్ విధానంలో మార్పులు లేవని స్పష్టీకరణ

2

లక్కీ లాటరీ సీఎం రేవంత్‌ను కూల్చే రోజులు త్వరలోనే ఉన్నాయి : కేటీఆర్



2

రేవంత్ రెడ్డి ఇంటికి ఒక న్యాయం.. ప్రజలకు మరో న్యాయమా? - రఘునందన్ రావు

- సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ బాధితుల సమావేశం
- 12 ఏళ్ల కిందటి కాలనీని 22ఏలో చేర్చారన్న రఘునందన్ రావు
- ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్



2

మిస్ వరల్డ్ 2026..
విజేతగా డొమినికన్ అమ్మాయి
జోహెర్రీ మోలా డొమింగ్వేజ్



- మిస్ వరల్డ్ 2026 కిరీటం డొమినికన్ రిపబ్లిక్ సుందరి జోహెర్రీ డొమింగ్వేజ్ కైవసం
- వియత్నాంలో జరిగిన 73వ ప్రపంచ సుందరి పోటీలు
- భారత్ అందాలభామ నికితా పోర్వాల్‌కు టాప్ 20లో చోటు దక్కని వైనం
- టాప్ 40లో స్థానం సంపాదించి సరిపెట్టుకున్న నికిత
- మలేసియా, స్పెయిన్ సుందరీలకు రన్నరప్ స్థానాలు

నిత్యం నిఘా, వియత్నాం : వియత్నాం వేదికగా అట్టహాసంగా జరిగిన 73వ మిస్ వరల్డ్ 2026 పోటీలు ముగిశాయి. ఈ ప్రతిష్ఠాత్మక కిరీటాన్ని డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన జోహెర్రీ మోలా డొమింగ్వేజ్ గెలుచుకుంది. స్పెయిన్‌కు చెందిన ఎలిసబెత్ రెయిస్ మొదటి రన్నరప్‌గా, మలేసియాకు చెందిన తానూసియా చెట్టి రెండో రన్నరప్‌గా నిలిచారు. గత ఏడాది విజేత, థాయ్‌లాండ్‌కు చెందిన ఓపల్ సుచాతా చువాంగ్‌శ్రీ.. కొత్త ప్రపంచ సుందరికి కిరీటాన్ని అలంకరించింది. కొత్త ప్రపంచ సుందరి జోహెర్రీ వృత్తిరీత్యా ఉపాధ్యాయురాలు, సామాజిక కార్యకర్త. 'వాయిసెస్ ఆఫ్ టుమారో' అనే సంస్థ ద్వారా వెనుకబడిన వర్గాల పిల్లలకు ఇంగ్లీష్ విద్యను అందిస్తున్నారు. ఆమె కమ్యూనిటీ సేవ, విద్యారంగంలో .. 2

కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్..?
: పుకార్లను కొట్టిపారేసిన కేంద్రం

- కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్‌కు స్పందన లేదన్న వార్తల్లో నిజం లేదన్న కేంద్రం
- ఆరోపణలను ఖండించిన కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ
- ఇప్పటికే టీఎఫ్ఎల్, ఎన్‌టీపీసీల నుంచి దరఖాస్తులు వచ్చాయని వెల్లడి
- 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు గ్యాసిఫికేషన్ లక్ష్యం



నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : దేశంలో కోల్ గ్యాసిఫికేషన్ పథకానికి ఆదరణ కరవైందంటూ వస్తున్న కథనాలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. రూ. 37,500 కోట్ల ప్రోత్సాహకాలతో కూడిన ఈ పథకానికి ఒక్క దరఖాస్తు కూడా రాలేదన్న ప్రచారాన్ని కేంద్రం తోసిపుచ్చింది. ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, ఇటువంటి అసత్య ప్రచారాలు ప్రాజెక్ట్‌పై ఎలాంటి ప్రభావం చూపలేవని కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.... 2

Nityam Nigha 06.09.26_Layout 1 9/6/2026 8:21 AM Page 2

ఆస్తుల వాటా కోసమే చెల్లిని తరిమేశారు

మొదటిపేజీ తరువాయి.. వెళ్లగొట్టారని తీవ్ర ఆరోపణలు చేశారు. సొంత చెల్లికే అన్నం పెట్టని వారు సామాన్య ప్రజలకు ఏం సేవ చేస్తారని ఆయన నిలదీశారు. కేవలం ఇంగ్లీష్ మాట్లాడినంత మాత్రాన కేటీఆర్ మేధావి కాలేరని, దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి ఎవరి చదువు ఎంతో తేల్చుకుందామని సవాల్ విసిరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పైనా రేవంత్ విమర్శలు గుప్పించారు. కేటీఆర్ భయంతోనే కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని, ప్రతిపక్ష నేతగా ఎన్నికైనప్పటికీ ఇప్పటివరకు అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాలేదని ఎద్దేవా చేశారు.

మిస్ వరల్డ్ 2026..

విజేతగా డొమినికన్ అమ్మాయి జోహెర్రీ మోలా డొమింగ్వెజ్



మొదటిపేజీ తరువాయి.. చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ కిరీటం దక్కిందని పలువురు ప్రశంసిస్తున్నారు. వచ్చే ఏడాది ఈ పోటీలకు టాంజానియా ఆతిథ్యం ఇవ్వనుంది. ఇదిలా ఉండగా, ఈ ఏడాది చివర్లో ఫ్యూర్టోరికోలో జరిగే మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరఫున కాజియా లిజ్ మేజో పాల్గొననున్నారు. ఈ పోటీల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించిన ఫెమినా మిస్ ఇండియా వరల్డ్ 2024 నికితా పోర్వాల్ టాప్ 40 వరకు చేరుకుంది. అయితే, ఆ తర్వాతి రౌండ్‌లో టాప్ 20లో ఆమెకు చోటు దక్కకపోవడంతో భారత అభిమానులకు నిరాశ ఎదురైంది. అయినప్పటికీ, వరుసగా ఐదోసారి మిస్ వరల్డ్ పోటీల్లో భారత్ స్థానం దక్కించుకునే పరంపరను నికితా కొనసాగించిందని, దేశానికి గర్వకారణంగా నిలిచారని మిస్ ఇండియా ఆర్గనైజేషన్ ఓ ప్రకటనలో అభినందించింది. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినికి చెందిన నికితా పోర్వాల్.. గతంలో టీవీ యాంకర్‌గా పనిచేశారు. నటిగా కూడా రాణిస్తున్న ఆమె, 'చంబల్ పార్' అనే బ్రిజ్ భాషా చిత్రంలో నటించారు. ఫైనల్‌లో ఆమె ధరించిన ప్రత్యేకమైన గౌను అందరినీ ఆకట్టుకుంది.

రేవంత్ రెడ్డి ఇంటికి ఒక న్యాయం..

ప్రజలకు మరో న్యాయమా?

- రఘునందన్ రావు

మొదటిపేజీ తరువాయి.. రూపాయి రూపాయి కూడబెట్టుకుని నిర్మించుకున్న ఇళ్లను రాత్రికి రాత్రి 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ దారుణ నిర్ణయమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ భూముల సమస్యపై ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. అన్ని ప్రభుత్వ శాఖల అనుమతులతో 55 ఎకరాల్లో 1,500 ఇళ్ల నిర్మాణం జరిగి 12 ఏళ్లు గడుస్తోందని... ఇప్పుడు ఉన్నట్టుండి ఆ ఇళ్లను నిషేధిత జాబితాలో పెట్టడంపై కాలనీవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. బాధితుల పక్షాన పోరాడతానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసాన్ని ఏ దరఖాస్తు ఆధారంగా 22ఏ జాబితా నుంచి తొలగించారో, అదే నిబంధనలను సామాన్య ప్రజల ఆస్తులకు కూడా వర్తింపజేసి వెంటనే తొలగించాలని ఎంపీ రఘునందన్ రావు సూటిగా నిలదీశారు. కేవలం సాంకేతిక తప్పు జరిగిందని రెవెన్యూ మంత్రి క్షమాపణలు చెబితే సరిపోదని, తక్షణమే ఆ తప్పును సరిదిద్ది ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ 22ఏ జాబితా పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సమస్యలు గాలికొదిలేసి దేనికి ఈ సంబరాలు? - హరీశ్ రావు

మొదటిపేజీ తరువాయి.. సంబరాలు చేసుకుంటోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల తీరు 'ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే' అన్న చందంగా తయారైందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగిస్తున్న పరిపాలనా విధానాన్ని, ఆయన పనితీరును ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కుంభకోణాలమయంగా మారిపోయిందని హరీశ్ రావు ఆరోపించారు. హామీలు నెరవేర్చడంలో విఫలమైన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని తాము డిమాండ్ చేస్తుంటే, బాధ్యతా రాహిత్యంగా కేసీఆర్ రాజీనామా చేయాలనడం విడ్డూరంగా ఉందన్నారు. రాజీనామా చేయాల్సింది కేసీఆర్ కాదని, ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డేనని తేల్చిచెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగుల ఆవేదన, జీఓ 97 రద్దు, రైతాంగానికి నమ్మకమైన ఉచిత విద్యుత్ సరఫరా వంటి కీలక ప్రజా సమస్యలే ఎజెండాగా రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ గళమెత్తుతుందని తెలిపారు. సభలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు అధినేత కేసీఆర్ బీఆర్ఎస్ఎల్పీ సమావేశంలో పూర్తి దిశానిర్దేశం చేస్తారని హరీశ్ రావు స్పష్టం చేశారు.

గ్లోబల్ లీడర్లలో మోదీ అత్యంత స్ఫూర్తిదాయకం

- బెల్జియం ప్రధాని ప్రశంసల వర్షం

మొదటిపేజీ తరువాయి.. ప్రపంచ రాజకీయాల్లో తీవ్ర అస్థిరత, భౌగోళిక ఉద్రిక్తతలు నెలకొన్న ప్రస్తుత తరుణంలో భారత ప్రధాని మోదీ అనుసరిస్తున్న దౌత్య విధానాలు, నాయకత్వ పటిమపై బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలోని అత్యంత స్ఫూర్తిదాయకమైన, తెలివైన నేతల్లో మోదీ అగ్రగామి అని అభివర్ణించిన ఆయన... మోదీతో భేటీ కావడం తనకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచంలోని పలువురు అగ్ర నేతల ప్రసంగాలు విన్నప్పుడు ఆందోళన, అభద్రతా భావం కలుగుతాయని... కానీ ప్రధాని మోదీ మాట్లాడితే ఆయన చెప్పిన దార్శనికతను అనుసరించాలనే నమ్మకం, స్ఫూర్తి కలుగుతాయని వ్యాఖ్యానించారు. విశ్వవేదికపై భారత్ పాత్ర అత్యంత కీలకంగా మారిందని కొనియాడిన బెల్జియం ప్రధాని... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను బెల్జియం ఒక విశ్వసనీయ భాగస్వామిగా చూస్తోందని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య దౌత్య, ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలను సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇదే సమయంలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలు, టారిఫ్‌లపై ఆయన పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఏ క్షణాన ఏ నిర్ణయం తీసుకుంటారో తెలియని అస్థిరత వల్ల ప్రపంచ వాణిజ్యమే ప్రమాదంలో పడుతుందని... స్వేచ్ఛా వాణిజ్యం, బలమైన ద్వైపాక్షిక భాగస్వామ్యాల ద్వారానే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. లష్కరే కమాండర్ హతం

మొదటిపేజీ తరువాయి.. జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత ప్రక్రియ కొనసాగుతోంది. శనివారం మధ్య కశ్మీర్‌లోని బుద్గాం జిల్లాలో భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో పాకిస్తాన్‌కు చెందిన లష్కరే తోయిబా (ఎల్ఈటీ) కమాండర్ యాసిర్ హతమయ్యాడు. యూస్‌మార్గ్ అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. యూస్‌మార్గ్ ప్రాంతంలో ఉగ్రవాదుల సంచారంపై నిఘా వర్గాల నుంచి అందిన కచ్చితమైన సమాచారంతో స్పెషల్ ఫోర్సెస్, 53 రాష్ట్రీయ రైఫిల్స్ దళాలు సంయుక్తంగా 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ ప్రారంభించాయి. భద్రతా బలగాల రాకను గమనించిన ఉగ్రవాదులు కాల్పులకు తెగబడటంతో దళాలు ప్రతిదాడి చేశాయి. ఈ కాల్పుల్లో యాసిర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. యాసిర్ గతంలో లష్కరే తోయిబాలోని సులేమాన్ మూసా గ్రూప్‌లో సభ్యుడిగా ఉండేవాడని, అయితే సుమారు ఏడాది క్రితం ఆ విభాగం నుంచి విడిపోయి సొంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి. గత కొంతకాలంగా యూస్‌మార్గ్ పరిసర ప్రాంతాల్లో అతడి కదలికలపై నిఘా ఉంచినట్లు అధికారులు తెలిపారు. యాసిర్ మృతి నేపథ్యంలో అతడి నెట్‌వర్క్, లష్కరే సభ్యులతో ఉన్న సంబంధాలు, అలాగే ఇటీవల జమ్ము కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడుల్లో అతడి ప్రమేయంపై దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయి. కాగా, 2025 పహల్గాం ఉగ్రదాడికి సూత్రధారి అయిన సులేమాన్ మూసాను గతంలోనే భద్రతా బలగాలు హతమార్చిన సంగతి తెలిసిందే. కశ్మీర్‌లో ఉగ్రవాద నిర్మూలనకు చేపట్టిన ఆపరేషన్లలో యాసిర్ ఎన్‌కౌంటర్ కీలక విజయమని అధికారులు పేర్కొన్నారు.

విద్యాశాఖలో కీలక మార్పులు.. టీచర్ల సమస్యలపై సీఎం రేవంత్ హామీ

మొదటిపేజీ తరువాయి.. విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకొస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులను పూర్తి చేశామని చెప్పారు. టీచర్ల బదిలీల విషయంలోనూ ప్రభుత్వం ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తోందన్నారు. కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. తల్లిదండ్రులతో సమానంగా పిల్లల భవిష్యత్తుకు పునాది వేసేది ఉపాధ్యాయులేనని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్ల సమయం ఇస్తే సమస్యలను పరిష్కరించి చూపిస్తానన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం చెప్పారు. సాంకేతిక విద్యకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు. పాలిటెక్నిక్ విద్యావిధానంలో ఎలాంటి మార్పులు చేయడం లేదని స్పష్టం చేశారు. విద్యాశాఖ కమిషన్ ద్వారా అనేక సమస్యలను పరిష్కరిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీఆర్సీ సమస్యను పరిష్కరించామని చెప్పారు. ఇటీవల ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేయడం తనకు చాలా బాధ కలిగించిందన్నారు. కార్యక్రమానికి ముందు కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఎం పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.


లక్కీ లాటరీ సీఎం రేవంత్‌ను కూల్చే రోజులు త్వరలోనే ఉన్నాయి: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ యువతకు స్కిల్ లేదనడానికి రేవంత్ రెడ్డికి ఏ అర్హత ఉందని, ఆయన స్వయంగా ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మోసాలపై బీఆర్ఎస్ నిర్వహించిన 'యువభేరి' సభలో పాల్గొన్న కేటీఆర్, కేవలం లక్కీ లాటరీ తగలడం వల్లే రేవంత్ సీఎం అయ్యారని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీనే గడగడలాడించిన తెలంగాణ యువ శక్తికి రేవంత్ రెడ్డి ఓ లెక్కే కాదన్నారు. ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ పేరిట పెద్ద పెద్ద మాటలు చెప్పిన కాంగ్రెస్ నేతలు, అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు ఇవ్వడం మానేసి లూటీఫికేషన్‌లు నడుపుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలంటున్న కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా, లేక ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించిన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. ప్రజలకు చేసిన 420 రకాల మోసాలకు గానూ రేవంత్ రెడ్డి 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు రాబోతున్నాయని హెచ్చరించారు. మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తమ ప్రభుత్వం 2.32 లక్షల ఉద్యోగాలు ఇస్తే, ఈ వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చినవి కేవలం 16 వేల ఉద్యోగాలేనని చెప్పారు. ఉద్యోగాల కల్పనపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

కోల్ గ్యాసిఫికేషన్ స్కీమ్..?

: పుకార్లను కొట్టిపారేసిన కేంద్రం

మొదటిపేజీ తరువాయి.. ఇప్పటికే ఈ పథకం కింద తాల్చేర్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ (టీఎఫ్ఎల్), ఎన్‌టీపీసీ నుంచి దరఖాస్తులు అందినట్లు వెల్లడించింది. ఈ పథకానికి సంబంధించిన తొలి విడత దరఖాస్తుల గడువు సెప్టెంబర్ 7తో ముగియనుందని ఈ సందర్భంగా గుర్తుచేసింది. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా దాదాపు 25 ప్రాజెక్టులు ఏర్పాటవుతాయని, తద్వారా సుమారు రూ. 2.5 లక్షల కోట్ల నుంచి రూ. 3 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు వస్తాయని కేంద్రం అంచనా వేస్తోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 వేల మందికి పైగా ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇంధన అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. దేశీయ బొగ్గు నిల్వలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గును గ్యాసిఫికేషన్ ప్రక్రియ ద్వారా వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం ఈ ఏడాది మే నెలలో ఈ ప్రతిష్ఠాత్మక పథకానికి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే.



Nityam Nigha 06.09.26_Layout 1 9/6/2026 8:21 AM Page 3

నాయుడు పెట్రోల్ పంపు సమీపంలో యువకుడి దారుణ హత్య



వరంగల్/ మామునూరు, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : వరంగల్ జిల్లా మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాయుడు పెట్రోల్ పంపు సమీపంలో ఓ యువకుడు హత్యకు గురైనట్లు సమాచారం. మృతుడిని తిమ్మాపూర్‌కు చెందిన గౌతమ్‌గా గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి ఓ అనుమానితుడిని మామునూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. హత్యకు గల కారణాలు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి చొరవ చూపాలి

- పోలీస్ అధికారులకు సీనియర్ సివిల్ జడ్జి అపర్ణ మల్లాది సూచన



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించేలా పోలీస్ అధికారులు చొరవ చూపాలని మంథని సీనియర్ సివిల్ జడ్జి అపర్ణ మల్లాది సూచించారు. శనివారం మంథని కోర్టు ప్రాంగణంలో పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్ ద్వారా ఇరుపక్షాల అంగీకారంతో కేసులను సత్వరమే పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. కేసుల పరిష్కారంతో కక్షిదారులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు న్యాయ ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా సంబంధిత వర్గాలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అర్రా సుధారాణి, మంథని సీఐ బుద్దే స్వామి, ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా సింగిరెడ్డి సునీత



జనగామ జిల్లా / రఘునాథపల్లి, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : రఘునాథపల్లి మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా వెల్ది గ్రామానికి చెందిన సర్పంచ్ సింగిరెడ్డి సునీత శ్రీనివాస్ ఎన్నికయ్యారు. తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు లింగాల జగదీశ్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని సునీత శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలో మహిళలను పార్టీతో మరింతగా అనుసంధానించి, కాంగ్రెస్ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ చర్ల, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : చర్ల మండల పరిధిలోని ఆర్.కొత్తగూడెం గ్రామం దానవాయిపేట ఎంపీయూపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తుర్రం రవికుమార్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.నానారాజును శాలువాతో సత్కరించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవికుమార్ మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. భావి భారత పౌరులను తీర్చిదిద్దే గురువులకు సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. హెచ్ఎం నానారాజుతో పాటు ఉపాధ్యాయ బృందం చేస్తున్న కృషి అభినందనీయమని, వారి కృషితో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగి ప్రగతిపథంలో ముందుకు సాగుతోందని కొనియాడారు. ప్రధానోపాధ్యాయుడు నానారాజు మాట్లాడుతూ విద్యార్థులను క్రమశిక్షణతో కూడిన ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ఉపాధ్యాయుల ప్రథమ కర్తవ్యమని అన్నారు. గ్రామస్తులు, ప్రజాప్రతినిధుల సహకారంతో పాఠశాలను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.సుహాసిని, కె.శాంతికుమార్, ఇ.నీలిమ, జి.పూర్ణిమ, సిహెచ్.హరిబాబు, విద్యా కమిటీ చైర్మన్ కె.రజిని, గ్రామ పెద్దలు ఆర్.రాజా, అంగన్వాడీ టీచర్లు టి.రామాంజమ్మ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

యువతను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసింది

- హామీల అమలులో విఫలం.. బీఆర్ఎస్ పోరుబాట ర్యాలీ



హనుమకొండ, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : యువత, నిరుద్యోగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు నినాదాలతో హోరెత్తించారు. మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ నేతృత్వంలో ఏకశిలా పార్క్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ కొనసాగింది. విద్యార్థి, యువజన విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఫ్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో యువత, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ, కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ర్యాలీలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గంగాపురిలో కోతుల బెడదకు పరిష్కారం

- ప్రజల భద్రత దృష్ట్యా కోతులను పట్టించిన 4వ వార్డు కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్‌బాబు



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : గంగాపురి మున్సిపాలిటీ 4వ వార్డులో కొంతకాలంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కోతుల బెడదకు పరిష్కారం లభించింది. కోతులు ఇళ్లలోకి ప్రవేశించి ఆహార పదార్థాలను తీసుకెళ్లడంతో పాటు వస్తువులను చిందరవందర చేయడం, పండ్లు, కూరగాయలను నాశనం చేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో 4వ వార్డు కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్‌బాబు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని కోతులను పట్టించే చర్యలు చేపట్టారు. కోతుల సంచారంతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారని ఆమె తెలిపారు. ఇళ్లపై, విద్యుత్ తీగలపై కోతులు సంచరించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. కోతుల బెడద పరిష్కారానికి సహకరించిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ మనోహర్‌రెడ్డికి కౌన్సిలర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు.

భీమారంలో తీవ్ర ఉద్రిక్తత

బీఆర్ఎస్ - కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఘర్షణ



హనుమకొండ, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : హనుమకొండ భీమారం ప్రాంతంలో శనివారం రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన 1000 రోజులు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు వస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌ను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అడ్డుకునేందుకు ప్రయత్నించినట్లు బీఆర్ఎస్ వర్గాలు ఆరోపించాయి. దీంతో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి తోపులాట చోటుచేసుకున్నట్లు సమాచారం. ఇరుపార్టీల కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు చేయడంతో భీమారం ప్రధాన రహదారిపై కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

Nityam Nigha 06.09.26_Layout 1 9/6/2026 8:21 AM Page 4

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి

- లేనిపక్షంలో సెప్టెంబర్ 17న ధర్నా: ఉద్యమకారుల సంఘం కన్వీనర్ మరుపల్ల రవి



వరంగల్, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 17న ఖిలా వరంగల్ మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమకారుల సంఘం కన్వీనర్ మరుపల్ల రవి హెచ్చరించారు. శనివారం ఉర్సులో జరిగిన సంఘం సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా అర్హులైన ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల పెన్షన్, ఉచిత వైద్య సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడుస్తున్నా హామీలు అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న పలువురు ఉద్యమకారులు జైలు జీవితం, కేసులతో ఆర్థికంగా నష్టపోయి ప్రస్తుతం దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నారని రవి ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం వాటిని విస్మరించడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా కొందరు ఉద్యమకారులపై కేసులు కొనసాగుతున్నాయని, వారు ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే ఉద్యమకారులపై ఉన్న కేసులను బేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. హామీలను తక్షణమే అమలు చేయకపోతే సెప్టెంబర్ 17న ధర్నాతో పాటు ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఉద్యమకారులు నాగవెల్లి సాంబయ్య, మేకల ఎల్లయ్య, అంకం దేవానంద్, కెంచ ఆనంద్, శంకేసి లింగమూర్తి, బొద్దుల కుమార్‌స్వామి, బితవటం కనకరాజు, కోడూరు నరేష్, మోక్ష సోమ మధుకర్, మాడిశెట్టి రాజ్‌కుమార్, వేల్పుల కుమార్‌స్వామి, ఆవునూరు లక్ష్మి, ముసినిపల్లి జమున, కొడిపాక రమాదేవి, చిదురాల సుజాత, పల్లకొండ యాకలక్ష్మి, సోమ ఉపేంద్ర, కొండపాక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సూరారం గ్రామానికి బస్సు సౌకర్యం



హనుమకొండ జిల్లా / ఎల్కతుర్తి, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : ఎల్కతుర్తి మండలంలోని సూరారం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామ మహిళలు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. మహిళల విజ్ఞప్తికి స్పందించిన మంత్రి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం హనుమకొండ నుంచి సూరారం గ్రామానికి ట్రయల్‌గా బస్సును నడిపి, గ్రామానికి బస్సు రాక పోకలకు మార్గం అనుకూలంగా ఉందా అనే అంశాన్ని పరిశీలించారు. దీంతో సూరారం గ్రామ ప్రజలు, ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి బస్సు సౌకర్యం అందుబాటులోకి వస్తే విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని గ్రామస్థులు తెలిపారు. తమ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సూరారం గ్రామ అధ్యక్షుడు బచ్చు శ్రీధర్‌రావు, సర్పంచ్ నీల కొమురయ్య, ఉపసర్పంచ్ మేకల బాబు, కుర్ర ప్రకాష్, చల్లూరి వేణు, మహమ్మద్ జావిద్, మొలుగూరి భాస్కర్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, పి. సంపత్, ఛత్రపతి, గ్రామపంచాయతీ కార్యదర్శి ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యాస హైస్కూల్‌లో విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

- ఘనంగా గురుపూజోత్సవం.. ఉపాధ్యాయులకు ఘన సన్మానం



వరంగల్, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ నగరంలోని 43వ డివిజన్ గణేష్‌నగర్‌లో గల అభ్యాస హైస్కూల్‌లో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాఠశాల డైరెక్టర్ శ్రీ మీర్జా అఖిల్ ఉల్లా బేగ్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉపాధ్యాయులు వెలుగునిచ్చే కొవ్వొత్తుల్లాంటి వారని, సమాజానికి అవసరమైన ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే గొప్ప బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. బోధన వృత్తి మాత్రమే కాదని, అదొక ప్రతిజ్ఞ అని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు సామర్థ్యంతో పాటు నైతిక విలువలు ఎంతో అవసరమని తెలిపారు. ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు తమ అనుభవాలను, అనుభూతులను పంచుకున్నారు. ఉపాధ్యాయ వృత్తిలోని బాధ్యతను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కలగడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ మండల శిరీష మాట్లాడుతూ ప్రేమ, అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయుడు విద్యార్థిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి అపరిమితమైన స్ఫూర్తిని కలిగించగలడన్నారు. విద్యా ప్రయాణంలో ఉపాధ్యాయుడు విద్యార్థికి మార్గదర్శిగా, శ్రేయోభిలాషిగా, స్నేహితుడిగా అండగా నిలవాలని అన్నారు. ఇన్‌చార్జి కోల రాము మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నుంచి దేశ ప్రథమ పౌరుడిగా ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ఉపాధ్యాయ వృత్తికి గర్వకారణమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులపై నమ్మకంతో పంపిస్తారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ఉపాధ్యాయుడి బాధ్యత అని అన్నారు. చీకటి సమ్మయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలను అందించినప్పుడే ఆ వృత్తికి నిజమైన గౌరవం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఈఓగా పాన్వీత్, ఎంఈఓగా షెహనాజ్, డైరెక్టర్‌గా మహేష్-బాబు, ప్రిన్సిపాల్‌గా సాజిలా, వైస్ ప్రిన్సిపాల్‌గా షష్మిన్, ఇన్‌చార్జీలుగా ఆలియా, అన్వేష్, అక్షిత్, రక్షిత, సౌమ్య, యశ్వకీర్తి, హిరణ్య, బ్లెస్సీ, రిషబ్, త్రినయ్, మనోజ్, ముధస్సిర్, తన్వీర్ తదితర విద్యార్థులు వివిధ బాధ్యతలను నిర్వహించారు. పీఈటీగా కూడా పలువురు విద్యార్థులు వ్యవహరించారు. అనంతరం పాఠశాల యాజమాన్యం గౌరవ ఉపాధ్యాయులను శాలువాలు, మెమెంటోలతో సత్కరించింది. ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో డైరెక్టర్ మీర్జా అఖిల్ ఉల్లా బేగ్‌ను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు తమ గురువులను సత్కరించడంతో పాటు డైరెక్టర్‌ను కూడా సన్మానించారు. చివరగా విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 10న మహా ధర్నా



వరంగల్, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (TGEJAC) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్–మహా ధర్నా'ను విజయవంతం చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి చేపట్టాల్సిన సన్నాహకాలపై శనివారం టీఎన్‌జీవోస్ భవన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించి, మహా ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీజీఈజేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ప్రధానంగా 2వ వేతన సవరణ సంఘం (2nd PRC) నివేదికను వెంటనే అమలు చేసి 01.07.2023 నుంచి 51 శాతం ఫిట్‌మెంట్ మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సుమారు రూ.10 వేల కోట్ల మేర పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, పెన్షనర్ల బిల్లులను వెంటనే చెల్లించాలని, ప్రతి నెలా కనీసం రూ.2 వేల కోట్ల చొప్పున పెండింగ్ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని, ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ఎన్‌ఈహెచ్‌ఎస్ (న్యూ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్)ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉద్యోగ సంఘాలకు గుర్తింపు పునరుద్ధరించి, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరపాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన ఇతర దీర్ఘకాలిక సమస్యలను కూడా తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లలో 'చలో హైదరాబాద్' కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పిస్తూ సన్నాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీజీఈజేఏసీ నాయకులు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు వ్యక్తిగతమైనవి కావని, లక్షలాది కుటుంబాలకు సంబంధించినవని పేర్కొన్నారు. సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్–మహా ధర్నా'కు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ రాష్ట్ర కార్యదర్శి ముజీబ్ హుస్సేన్, అసోసియేట్ అధ్యక్షులు ముత్యాల సత్యనారాయణ గౌడ్, కస్తూరి వెంకట్, రాష్ట్ర కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు, టీజీవోస్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్, టీజీఈజేఏసీ వరంగల్ జిల్లా చైర్మన్ గాజే వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి పాలకుర్తి సదానందం, గౌరవ అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్, టీజీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పనికుమార్, రాజేష్‌రెడ్డి, పీఆర్‌టీయూటీఎస అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ తాటికాయల కుమార్, సుజన్ ప్రసాద్, ఎస్టీయూటీఎస్ కుమారస్వామి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు సాంబయ్య, భానుప్రకాష్, టీపీటీఎఫ్ ఉట్కూరి అశోక్, టీఆర్‌టీఎఫ్ కిషన్, డీటీఎఫ్ గోవిందరావు, టీపీఆర్‌టీఎఫ్ శ్రీనివాస్‌రెడ్డి, పెన్షనర్ల సంఘం నాయకులు ధర్మరాజు, సోమయ్య, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ విధానాలు పాటించాలి

- రైతులకు మండల వ్యవసాయ అధికారి సూచన



ములుగు జిల్లా/ తాడ్వాయి, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి):తాడ్వాయి మండల పరిధిలోని అంకంపల్లి గ్రామపంచాయతీలో సర్పంచ్ ఇరుప వెంకటేష్ ఆధ్వర్యంలో రైతుల పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, ఏఈఓలు పాల్గొని రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వరి పంటలో సమగ్ర ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ విధానాలను పాటించి అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులు ముందుకు సాగాలని సూచించారు. వరి నాట్లు వేసినప్పటి నుంచి కోత వరకు పాటించాల్సిన సాగు పద్ధతులు, నీటి యాజమాన్యం, ఎరువులు, సూక్ష్మ పోషకాల వినియోగం, తెగుళ్లు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. పంట మార్పిడి విధానాన్ని రైతులు అలవర్చుకోవాలని సూచించారు. మొక్కజొన్న, పత్తి, మిరప తదితర ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆరుతడి పంటల సాగు వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు వివరించారు. రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని, నాసిరకం విత్తనాలను వినియోగించి నష్టపోవద్దని సూచించారు. రైతులకు మేలు చేకూర్చేందుకు ప్రభుత్వం సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలను అందించేందుకు చర్యలు చేపడుతోందని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పంటల సాగుపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇరుప వెంకటేష్, ఏఈఓలు కుమార్, దుర్గాప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 06.09.26_Layout 1 9/6/2026 8:21 AM Page 5

మానవ సేవకు మదర్ థెరిసా జీవితం ఆదర్శం



హనుమకొండ, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : మదర్ థెరిసా వర్ధంతిని పురస్కరించుకుని ఫాతిమానగర్‌లోని ఆమె విగ్రహం వద్ద శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొని మదర్ థెరిసాకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలోని పేదలు, నిరుపేదలు, అనాథలు, నిరాశ్రయులు, అభాగ్యుల కోసం మదర్ థెరిసా చేసిన సేవలు చిర స్మరణీయమని అన్నారు. ఎలాంటి స్వార్థం లేకుండా మానవ సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన ఆమె సేవా స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మదర్ థెరిసా చూపిన మానవతా మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మదర్ థెరిసా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొని మదర్ థెరిసా సేవలను స్మరించుకున్నారు.

కుడా చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి బాధ్యతల స్వీకారం



హనుమకొండ, సెప్టెంబర్ 5 (నిత్యం నిఘా ప్రతినిధి) : కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్‌పర్సన్‌గా గుండు సుధారాణి శనివారం కుడా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా అధికారి అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుండు సుధారాణికి శుభాకాంక్షలు తెలిపిన వారు కుడా పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని ఆకాంక్షించారు.

శ్రీ భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

హన్మకొండ/ భద్రకాళీ ఆలయం, సెప్టెంబర్ 5 (నిత్యం నిఘా ప్రతినిధి) : చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి శనివారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్సీకి ఆలయ అధికారులు హరినాథ్, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ముందుగా వల్లభ గణపతిని దర్శించుకున్న అనంతరం ఆలయంలోకి ప్రవేశించిన ఎమ్మెల్సీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మహామండపంలో ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీకి అమ్మవారి శేషవస్త్రాలను బహూకరించి, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే భావి సమాజ నిర్మాతలు



హనుమకొండ, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : సమాజ నిర్మాణంలో, భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర వర్ణనాతీతమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ విద్యాశాఖ అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం విద్యాబోధనలో విశేష సేవలు అందిస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి విద్యార్థులను ఉత్తమ ఫలితాల వైపు నడిపించిన పలువురు ప్రభుత్వ పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులను శాలువాలు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో సత్కరించి పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేసేది ఉపాధ్యాయులేనన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, ఆ జన్మకు సార్థకత చేకూర్చే విజ్ఞానం, క్రమశిక్షణను గురువులు అందిస్తారని పేర్కొన్నారు. ఆధునిక కాలంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి, వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సామాజిక అభివృద్ధి, మానవ వనరుల వికాసంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో కీలకమని తెలిపారు. పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ విద్యార్థులకు మరింత మెరుగైన విద్యను అందించి హనుమకొండ జిల్లాను విద్యారంగంలో అగ్రగామిగా నిలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), వివిధ మండలాల విద్యాధికారులు (ఎంఈఓలు), కలెక్టరేట్ సిబ్బంది, పురస్కార గ్రహీతల కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పురస్కార గ్రహీతలతో కలిసి కలెక్టర్ గ్రూప్ ఫోటో దిగారు.

ప్రెజర్ బాంబు బాధిత ఆదివాసీ కుటుంబాన్ని ఆదుకోవాలి



ములుగు జిల్లా / వెంకటాపురం , సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : అడవిలో జీవనోపాధి కోసం కంక బొంగులు సేకరించేందుకు వెళ్లి ప్రెజర్ బాంబు పేలుడులో మృతిచెందిన నూగూరు కాలనీకి చెందిన మడకం నాగేశ్వరరావు కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని గొండ్వానా సంక్షేమ పరిషత్ (జీఎస్పీ), ఆదివాసీ సర్పంచులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీఎస్పీ, ఆదివాసీ సర్పంచుల ఆధ్వర్యంలో వెంకటాపురం మండల తహసీల్దార్ వేణుగోపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నాగేశ్వరరావు మృతితో ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడిందని, ప్రభుత్వం నుంచి తక్షణ ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గొండ్వానా సంక్షేమ పరిషత్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కన్వీనర్ సోంది వీరయ్య మాట్లాడుతూ.. కర్రగుట్టల సమీపంలో బుధవారం జరిగిన విషాదకర ప్రెజర్ బాంబు పేలుడు ఘటనలో మడకం నాగేశ్వరరావు మృతిచెందడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబం ఆధారాన్ని కోల్పోయి నిరాశ్రయ స్థితిలోకి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీల జీవన విధానం పూర్తిగా అడవితో ముడిపడి ఉంటుందని, జీవనోపాధి కోసం అడవికి వెళ్లే పరిస్థితి ఉన్నందున అక్కడ మిగిలి ఉన్న ప్రెజర్ బాంబులను తొలగించాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ పూర్తయిందని చెబుతున్నప్పటికీ అడవుల్లో పేలుడు పదార్థాలు మిగిలి ఉండటం వల్ల ఆదివాసీ ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని అన్నారు. ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం వెంటనే స్పందించి అడవుల్లో మిగిలి ఉన్న ప్రెజర్ బాంబులను గుర్తించి తొలగించాలని, ఆదివాసీల భద్రతకు భరోసా కల్పించాలని కోరారు. మడకం నాగేశ్వరరావు కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గొండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయి, జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్, వెంకటాపురం మేజర్ సర్పంచ్ తాటి సరస్వతి, బెస్తగూడెం సర్పంచ్ భీమేశ్వరి, పాత్రపురం సర్పంచ్ బొగ్గుల పుష్పవతి, తిప్పాపురం సర్పంచ్ చందా శిరీష, మాజీ సర్పంచ్ జజ్జరి నారాయణమ్మ, సూరవీడు సర్పంచ్ ఇర్ప మురళి, పూనెం సూర్యం తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి వేడుకలకు పకడ్బందీ బందోబస్తు



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి): వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా మంథని పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. సెప్టెంబర్ 14న జరగనున్న వినాయక చవితి వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ, హిస్టరీ షీటర్లకు శనివారం మంథని పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. పండుగ సమయంలో గొడవలకు పాల్పడటం, నేరాలకు పాల్పడటం, బలవంతంగా చందాలు వసూలు చేయడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, గుంపులుగా ఏర్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ పరిధి దాటి వెళ్లే ముందు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. పండుగ బందోబస్తులో భాగంగా బీట్ చెకింగ్, నైట్ రౌండ్స్, ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే మంథని పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు.

నిర్లక్ష్యానికి గురైన మహంకాళి బావి



వరంగల్, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలో ఉన్న మహిమగల్ల బావి (మహంకాళి బావి) అధికారుల నిర్లక్ష్యంతో చెత్తాచెదారంతో నిండిపోయి దయనీయ స్థితికి చేరుకుంది. సరైన నిర్వహణ లేక బావి పరిసరాలు పూర్తిగా అస్తవ్యస్తంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు మహంకాళి బావి రంగశాయిపేట ప్రజల జీవనంతో ముడిపడి ఉండేదని స్థానికులు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఈ బావి నీటిని స్థానిక ప్రజలు వినియోగించుకున్నారని గుర్తుచేశారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ బావి నేడు నిర్లక్ష్యానికి గురికావడం బాధాకరమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో ప్రాంతానికి చెందిన విలువైన వారసత్వ సంపద కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందని వారు పేర్కొన్నారు. మహంకాళి బావిని కేవలం నీటి వనరుగా కాకుండా ప్రాంత చరిత్ర, సంస్కృతికి ప్రతీకగా గుర్తించి పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి బావిని శుభ్రం చేయడంతో పాటు పరిసరాలను అభివృద్ధి చేసి, భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండేలా పరిరక్షణ చర్యలు చేపట్టాలని స్థానిక కాలనీవాసులు మండల రాములు, పంచకం నరసయ్య, తోట మహేందర్, బాల్నే విజయ్‌కుమార్ కోరారు.

Nityam Nigha 06.09.26_Layout 1 9/6/2026 8:21 AM Page 6

ఎల్కతుర్తిలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



హనుమకొండ జిల్లా / ఎల్కతుర్తి, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఎల్కతుర్తి మండల వనరుల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను పెంపొందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. విద్యారంగానికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమానికి జెడ్పీహెచ్ఎస్ ఎల్కతుర్తి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు దుర్గాభవాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల్లో విశిష్ట సేవలు అందిస్తున్న తొమ్మిది మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి శాలువా, మెమెంటో, ప్రశంసాపత్రాలతో ఘనంగా సన్మానించారు. సన్మానం పొందిన వారిలో యెర్ర తిరుపతి, ఎడ్ల చంద్రప్రకాశ్‌రావు, ముప్పిడి రామ్‌కుమార్‌రెడ్డి, అకునూరి పుష్పలత, బొమ్మరబోయిన వెంకటేశ్వర్లు, బొల్లంపెల్లి శోభారాణి, యెనుములపల్లి చంద్రశేఖర్, చాడ మనుజాదేవి, బండి సంధ్యారాణి ఉన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను అధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు అభినందించారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి సన్మానించడం ద్వారా వారు మరింత బాధ్యతతో విద్యాబోధన చేసేందుకు ప్రోత్సాహం లభిస్తుందని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతను నమ్మించి కాంగ్రెస్ మోసం చేసింది : చల్లా ధర్మారెడ్డి

హనుమకొండ / పరకాల, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎన్నికల ముందు యువతకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా మోసం చేసిందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆరోపించారు. విద్యార్థులు, నిరుద్యోగుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి యువత తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా శనివారం పరకాల పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ కూడలి వరకు కొనసాగి తిరిగి అంబేద్కర్ సెంటర్‌కు చేరుకుంది. వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ర్యాలీలో పాల్గొని తమ మద్దతు తెలిపారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ర్యాలీలో పాల్గొనేందుకు వస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడంపై చల్లా ధర్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల నిరసనలను అడ్డుకోవడం సరైన పద్ధతి కాదని, ప్రశ్నించే గొంతులను అణచివేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఈ క్రమంలో పోలీసులకు, నిరసనకారులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది.





– హామీలు ఎక్కడ?

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా యువతను మోసం చేస్తోందని చల్లా ధర్మారెడ్డి విమర్శించారు. నిరుద్యోగులకు నెలకు రూ.4 వేల భృతి, తొలి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, యూత్ కమిషన్ ఏర్పాటు వంటి హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థులకు రూ.10 లక్షల వడ్డీలేని రుణాలు, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల అమలుపైనా ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు విదేశీ విద్య కోసం ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీని కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

– బీఆర్ఎస్ హయాంలో విద్యారంగానికి ప్రాధాన్యం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టామని చల్లా ధర్మారెడ్డి తెలిపారు. గురుకులాలు, జూనియర్ కళాశాలలు, ప్రత్యేక మైనార్టీ గురుకులాల ఏర్పాటుతో పాటు 'మన ఊరు–మన బడి', 'మన బస్తీ–మన బడి' కార్యక్రమాల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లతో పాటు కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు, యూనివర్సిటీల బలోపేతం వంటి చర్యలు చేపట్టామని తెలిపారు. మహాత్మా జ్యోతిబా పూలే, అంబేద్కర్ విదేశీ విద్యానిధి పథకాల ద్వారా విద్యార్థులకు విదేశీ విద్య కోసం ఆర్థిక సహాయం అందించామని వివరించారు.

– జీఓ 97ను రద్దు చేయాలి

పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జీఓ 97ను వెంటనే రద్దు చేయాలని చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తుతో ఆడుకుంటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజాక్షేత్రంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, యువజన నాయకులు, విద్యార్థులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీల అమలులో విఫలం : ఎర్రబెల్లి దయాకర్‌రావు

వరంగల్ / నర్సంపేట, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తయినా యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం నర్సంపేట చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు చేపట్టిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పార్టీ పరిశీలకుడు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జాబ్ క్యాలెండర్, స్కూటీలు, యూత్ డిక్లరేషన్, రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా భరోసా కార్డు వంటి హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటి అమలులో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తోందని అన్నారు. ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ.. యూత్ డిక్లరేషన్ పేరుతో యువతకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా విద్యార్థులు, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ఆరోపించారు. జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలిగించే జీవో నంబర్ 97ను వెంటనే రద్దు చేసి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నర్సంపేట నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, యువజన, విద్యార్థి విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





సంపాదకీయం

నీవు వస్తావని ఆశ మామా...

వాన కోసం రైతన్న ఎదురుచూపు..
కన్నీళ్లను తుడిచే చినుకుల కోసం ఆర్తనాదం



కొందరు బడాబాబులు
వెంచర్ల పేరుతో
ప్రకృతిని నాశనం చేస్తూ...
'ఎల్‌నినో' అనే భూతాన్ని
మన ముందుకు తీసుకొచ్చారు!

వాన బాణం వేసి
ఆ ఎల్‌నినోను తరిమేసి,
మమ్మల్ని కాపాడు మామా..!

సద్ది తీసుకుని
పొలం కాడికి వచ్చిన నీవు...
వస్తే నిన్ను చూస్తూ
సద్ది అన్నం తినాలని ఉంది
మామా..!

నా పెనిమిటి
రాత్రింబవళ్లు అని చూడకుండా...
పొలం గట్టుమీద కూర్చొని
నీ వైపే చూస్తూ
కన్నీళ్లు పెడుతున్నాడు...

అతని కళ్లను
వాన చినుకుతో తడిపి,
మా కన్నీళ్లను తుడిచి
మమ్మల్ని కాపాడు మామా..!

నీవు రాక
వ్యవసాయ పనులు మందగిం
చాయి...
కూలికి వెళ్లే ప్రతి ఒక్కరూ,
వ్యవసాయం చేసే ప్రతి రైతన్నా
అర్ధాకలితో అలమటిస్తున్నారు...

రా మామా...
పచ్చి మా పొలాలకు ప్రాణం పోసి,
మా ఆకలి కేకలను
చల్లార్చు మామా..!

రచన: శ్రీమతి మంజుల పత్తిపాటి
ఆలేరు వ్యవసాయ మార్కెట్
కమిటీ డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా,
తెలంగాణ

గురువుల సేవలు వెలకట్టలేనివి





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/చర్ల, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : చర్ల మండలంలోని ఆర్.కొత్తగూడెం గ్రామంలో శ్రీ రామచంద్ర కేరళ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నర్సరీ నుంచి 7వ తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, బుడిబుడి మాటల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. వివిధ రకాల వేషధారణల్లో చిన్నారులు సందడి చేస్తూ గురువుల పట్ల తమకున్న గౌరవం, కృతజ్ఞతలను చాటుకున్నారు. పాఠశాల నిర్వాహకులు ధర్మిశెట్టి కృష్ణమోహన్ మాట్లాడుతూ.. చిన్నారుల భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే బలమైన పునాది అని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు క్రమశిక్షణ, సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 06.09.26_Layout 1 9/6/2026 8:21 AM Page 7

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

సినీ దిగ్గజం రాజబాబు సోదరుడు చిట్టిబాబుతో మంథని పాత్రికేయుల ఆత్మీయ భేటీ





హైదరాబాద్, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలుగు సినీ రంగంలో కమెడియన్‌గా విశేష గుర్తింపు పొందిన ప్రముఖ నటుడు రాజబాబు సోదరుడు చిట్టిబాబును మంథనికి చెందిన సీనియర్ పాత్రికేయులు శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చిట్టిబాబుతో పాత్రికేయులు ఆత్మీయంగా ముచ్చటించి, సినీ రంగానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను చర్చించారు. అనంతరం ఆయన ఆహ్వానం మేరకు తేనీటి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిట్టిబాబు పాత్రికేయులకు తిరుమల తిరుపతి దేవస్థానం జ్ఞాపికలను అందజేశారు. మంథని ప్రాంతానికి చెందిన పాత్రికేయులు తనను కలవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

మంథనిలో ప్రత్యేక గాన కచేరీ

ఈ సందర్భంగా తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిట్టిబాబుతో ఫోన్‌లో ఆత్మీయంగా సంభాషించారు. మంథనిలో మహావాది సోదరులతో ప్రత్యేక గాన కచేరీని నిర్వహించి, కార్యక్రమానికి చిట్టిబాబు ముఖ్య అతిథిగా హాజరై తన చేతుల మీదుగా కార్యక్రమాన్ని నిర్వహించాలని మంత్రి కోరినట్లు తెలిపారు. మంథని ప్రాంతంలో సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక గాన కచేరీని నిర్వహించనున్నట్లు మంత్రి పేర్కొన్నట్లు సమాచారం. చిట్టిబాబు వంటి సినీ రంగ ప్రముఖులు మంథనికి వచ్చి స్థానిక కళాకారులను ప్రోత్సహించడం ద్వారా ఈ ప్రాంతానికి మరింత గుర్తింపు లభిస్తుందని పాత్రికేయులు అభిప్రాయపడ్డారు. ఈ ఆత్మీయ భేటీ సినీ, పాత్రికేయ, సాంస్కృతిక రంగాల మధ్య స్నేహపూర్వక అనుబంధానికి వేదికగా నిలిచిందని పాత్రికేయులు పేర్కొన్నారు.

చండ్రుపట్ల ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా గురుపూజోత్సవం

ములుగు జిల్లా/ వాజేడు, సెప్టెంబర్ 5 (నిత్యం నిఘా ప్రతినిధి) : వాజేడు మండలంలోని చండ్రుపట్ల ప్రభుత్వ పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సంతోష్, ఉపాధ్యాయులు నజీమ్‌లను సర్పంచ్ అనుముల సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శి బంధం రవీందర్, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంధ్యారాణి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. సమాజంలో ఉపాధ్యాయుల గౌరవాన్ని మరింత పెంపొందించేలా వ్యవస్థలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత ఉపాధ్యాయుల కృషితో చండ్రుపట్ల ప్రభుత్వ పాఠశాల ఎంతో అభివృద్ధి చెందిందని, విద్యా ప్రమాణాలు మెరుగుపడ్డాయని కొనియాడారు. విద్యార్థుల్లో క్రమశిక్షణతో కూడిన మార్పు తీసుకురావడంతో పాటు పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కూడా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు సంతోష్ మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి సన్మానించడం ఉపాధ్యాయ వృత్తికే దక్కిన గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విలేజ్ పోస్ట్‌మాస్టర్ మల్లిక, రెండో అంగన్‌వాడీ టీచర్ పద్మ, పంచాయతీ కారోబార్ గణపతి, తల్లిదండ్రులు, గ్రామపంచాయతీ సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ పోరుబాట

మహబూబాబాద్ జిల్లా / తొర్రూరు, సెప్టెంబర్ 5 (నిత్యం నిఘా ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఎన్నికల హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా శనివారం తొర్రూరు మండల కేంద్రంలో నాలుగో రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, యువత, విద్యార్థులు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. విద్యార్థినులకు స్కూటీలు, విద్యార్థులకు రూ.5 లక్షల గ్యారంటీ కార్డు, నిరుద్యోగులకు భృతి, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ వంటి హామీలను అమలు చేయలేదని అన్నారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా అందడం లేదని, గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల విషయంలోనూ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. విద్యార్థులు, యువత పట్ల విజన్ ఉన్న నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, వృద్ధులు, ఒంటరి మహిళలకు రూ.4 వేల పెన్షన్, వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ వంటి హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు స్కూటీలు, ల్యాప్‌టాప్‌లు అందిస్తామని ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చాలని అన్నారు. కేసీఆర్



ప్రభుత్వ హయాంలో కల్యాణలక్ష్మి , షాదీముబారక్, కేసీఆర్ కిట్, ఆసరా పెన్షన్ల వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని తెలిపారు. వృద్ధులు, ఒంటరి మహిళలు, వికలాంగులకు పెన్షన్లు పెంచి వారి సంక్షేమానికి కృషి చేశామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణలో అన్ని వర్గాల సంక్షేమానికి కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధిష్టానం పిలుపు మేరకు నిర్వహించిన ఈ నిరసనలో దేవరుప్పుల, కొడకండ్ల, పాలకుర్తి, రాయపర్తి, పెద్దవంగర, తొర్రూరు మండలాలకు చెందిన యువత, విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా, మండల స్థాయి బీఆర్ఎస్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషించాలి

వరంగల్, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో 'సంఘమిత్ర' కార్యక్రమాన్ని శనివారం ఘనంగా ప్రారంభించారు. హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పోలీసు అధికారులు, జిల్లా అధికారులు, స్వయం సహాయక సంఘాల (SHG) మహిళలు, గ్రామ దీపికలు (VOA), మెప్మా సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి పోలీసులతో పాటు ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమన్నారు. ప్రతి SHG, VOA సభ్యురాలు 'సంఘమిత్ర'గా పనిచేస్తూ మత్తు పదార్థాలకు వ్యతిరేక అవగాహన సందేశాన్ని ప్రతి ఇంటికి, ప్రతి గడపకు తీసుకెళ్లాలని కోరారు. సుమారు 1.17 లక్షల మంది సభ్యుల ద్వారా జిల్లాలోని ప్రతి కుటుంబానికి డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని చేరవేయడం కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి తల్లి తన పిల్లల భవిష్యత్తుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పిల్లల ప్రవర్తనలో మార్పులు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వారితో స్నేహపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వినియోగం, విక్రయం లేదా సరఫరాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు విలువైన సమాచారం అందించిన వారికి తగిన రివార్డు అందజేస్తామని తెలిపారు. డ్రగ్స్‌కు బానిసైన వారిని దూరం చేయకుండా కౌన్సెలింగ్, వైద్య సహాయం, కుటుంబ సహకారం అందించాలని, సరైన సమయంలో సహాయం అందిస్తే వారిని సాధారణ జీవితంలోకి తీసుకురావచ్చని అన్నారు. ''డ్రగ్స్‌కు నో చెప్పండి.. జీవితానికి యెస్ చెప్పండి'' అని పిలుపునిచ్చారు.

డ్రగ్స్ సమస్య సమాజం మొత్తానిది

వరంగల్ జిల్లా కలెక్టర్ డా.సత్యశారద మాట్లాడుతూ.. డ్రగ్స్ సమస్య కేవలం పోలీస్ శాఖకు సంబంధించినది కాదని, మొత్తం సమాజం సమిష్టిగా ఎదుర్కోవాల్సిన సమస్య అని అన్నారు. యువతను సన్మార్గంలో నడిపించడంలో తల్లిదండ్రులు, కుటుంబాలు, విద్యా సంస్థలు, గ్రామ సమైక్య సంఘాలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రతి కుటుంబంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కల్పించాలని, తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా మెలిగి వారి సమస్యలను తెలుసుకోవాలని తెలిపారు.

'సంఘమిత్రలు సైనికుల్లా పనిచేయాలి'

ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ మాట్లాడుతూ.. సంఘమిత్ర కార్యక్రమంలో పాల్గొంటున్న ప్రతి SHG సభ్యురాలు తన గ్రామంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కల్పించే సైనికురాలిగా పనిచేయాలని కోరారు.



ప్రతి కుటుంబంతో మాట్లాడి మత్తు పదార్థాల వల్ల కలిగే ప్రమాదాలను వివరించాలని సూచించారు. డ్రగ్స్ విక్రయం, సరఫరా, వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో గతంలో డ్రగ్స్‌కు బానిసై వాటిని పూర్తిగా వదిలి సాధారణ జీవితంలోకి వచ్చిన వ్యక్తి తన అనుభవాలను పంచుకున్నారు. డ్రగ్స్ తనకు కొద్దిసేపు మత్తును ఇచ్చినా, కుటుంబానికి మాత్రం ఎన్నో రోజుల కన్నీళ్లను మిగిల్చాయని చెబుతూ యువత ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలను ప్రయత్నించవద్దని సూచించారు. విద్యార్థినులు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రత్యేక అవగాహన స్కిట్ ప్రదర్శించారు. ముఖ్యమంత్రి, డీజీపీ, తెలంగాణ నార్కోటిక్స్ బ్యూరో (TG NAB) డైరెక్టర్ తదితరుల డ్రగ్స్ వ్యతిరేక సందేశాల వీడియోలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వై.వి.గణేష్, పీడీ డీఆర్‌డీఓ నాగపద్మజ, జిల్లా వైద్యాధికారి రాజిరెడ్డి, అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్, మామునూరు ఏసీపీ వెంకటేష్, గీసుగొండ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్, సైకియాట్రిస్ట్ డాక్టర్ భరత్, జిల్లా సమైక్య సంఘం అధ్యక్షురాలు రజిత, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు పద్మతో పాటు వెయ్యికి పైగా మహిళా సంఘాల సభ్యులు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ప్రతి తల్లి చైతన్యవంతమైతే – ప్రతి కుటుంబం సురక్షితం. ప్రతి కుటుంబం చైతన్యవంతమైతే – డ్రగ్స్ రహిత సమాజం సాధ్యమే అనే సందేశంతో 'సంఘమిత్ర' కార్యక్రమాన్ని వరంగల్‌లో ప్రారంభించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

వరంగల్/ సంగెం, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సంగెం మండలంలోని నార్లవాయి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కమరున్నిసా బేగం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సరీ నుంచి ఐదో తరగతి వరకు విద్యనభ్యసిస్తున్న చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, వారి బుడిబుడి మాటల ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. గురువుల పట్ల తమకున్న గౌరవం, కృతజ్ఞతలను విద్యార్థులు తమ మాటలు, ప్రదర్శనల ద్వారా చాటుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు కమరున్నిసా బేగం మాట్లాడుతూ.. చిన్నారుల భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే బలమైన పునాది అని అన్నారు. పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు తమ ఉపాధ్యాయులను ఘనంగా



సన్మానించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, అరుణ, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

Nityam Nigha 06.09.26_Layout 1 9/6/2026 8:21 AM Page 8

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు

పెద్దపల్లి జిల్లా/ మంథని, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఆరెంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం నరసింహారావు మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. విద్యతో పాటు విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని విద్యార్థుల్లో పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో చదివి పాఠశాలకు మంచి ఫలితాలు సాధించి పెట్టాలని సూచించారు. లక్ష్యాలను నిర్దేశించుకుని సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని జ్ఞానంతో పాటు వినయాన్ని అలవర్చుకోవాలని సూచించారు. సీఆర్పీ మల్లయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా వినాలని అన్నారు. తరగతిలో నేర్చుకున్న అంశాలను ఇంటి వద్ద పునశ్చరణ చేసుకోవడంతో పాటు సందేహాలను ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు.



ఉత్తమ ఉపాధ్యాయురాలిగా శ్రీలతకు సన్మానం

గత విద్యా సంవత్సరంలో పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేసిన శ్రీలత విద్యార్థుల విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ చూపినందుకు పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఆమెకు మంజూరైన 27 రోజుల సెలవుల్లో 16 రోజులు పాఠశాలకు హాజరై విద్యార్థులకు బోధన అందించినందుకు గుర్తింపుగా ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు ఆమెను ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, ప్రేమతో తీసుకొచ్చిన చిరుకానుకలను అందజేసి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సువార్త, మమత, పద్మజ, ఎం.డి. గియాసుద్దీన్, శ్రీవాణి, శ్రీలత, సహేందర్, అమన్ తదితరులు పాల్గొన్నారు.

పాడుపు సంఘం సభ్యుడి నామినీకి రూ.80 వేల క్లెయిమ్



హన్మకొండ/ మడికొండ, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి): మడికొండ పురుషుల పొదుపు సంఘం సభ్యుడైన తండ సురేష్ నామినీకి రూ.80 వేల క్లెయిమ్ మొత్తాన్ని సంఘం ఆధ్వర్యంలో అందజేశారు. సంఘ అధ్యక్షులు గనకులు, సమితి అధ్యక్షులు, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో ఈ మొత్తాన్ని నామినీకి అందజేశారు. సభ్యుల సంక్షేమం, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంలో పొదుపు సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం పాలకవర్గ సభ్యులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గురువుల సేవలు వెలకట్టలేనివి

వరంగల్/ పర్వతగిరి, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : పర్వతగిరి మండలం అన్నారం గ్రామంలోని పల్లవి మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు గురువుల పట్ల తమకున్న గౌరవం, అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులను విద్యార్థులు శాలువాలు, మెమెంటోలు, ప్రశంసా పత్రాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. బోధనేతర, భోజన సిబ్బందిని సైతం అభినందించి వారి సేవలను గుర్తించారు. పాఠశాల చైర్మన్ రాచకొండ అశోకచారి మాట్లాడుతూ. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని, విద్యారంగానికి ఆయన అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు. రాధాకృష్ణన్ ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాల వైపు పయనించాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసి వారి భవిష్యత్తుకు సరైన దిశానిర్దేశం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. కరస్పాండెంట్ గండి మహేందర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలను బోధించే వారు మాత్రమే కాదని, విద్యార్థుల్లో విలువలు, క్రమశిక్షణ, సంస్కారం, సామాజిక బాధ్యతలను పెంపొందించే మార్గదర్శకులని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి విజయం వెనుక గురువు కృషి, ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఉంటాయని అన్నారు. డైరెక్టర్ కోటగిరి రమేష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడు భావి భారత పౌరులను తీర్చిదిద్దే శిల్పి అని అన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనదని తెలిపారు.



★ ఉపాధ్యాయులకు సరదా పోటీలు

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల కోసం క్రీడలు, వినోద కార్యక్రమాలు, సరదా పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన ఉపాధ్యాయులకు మేనేజ్‌మెంట్ తరఫున ప్రత్యేక బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలు, ఉపాధ్యాయ దినోత్సవం ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడి చదవడం, ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవడం ద్వారా జీవితంలో విజయాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్లు రాజు, నవ్యశ్రీ, వకుళదేవి, ఉపాధ్యాయులు, బోధన, బోధనేతర, భోజన సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో గిరిజన విద్యార్థులు



ఏటూరునాగారం, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆదివాసీ నవనిర్మాణ సేన జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్ డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖకు కోట్లాది రూపాయలు నిధులు కేటాయిస్తున్నట్లు పాలకులు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో విద్యార్థులకు కనీస వసతులు అందడం లేదని ఆయన ఆరోపించారు. శనివారం ఆదివాసీ నవనిర్మాణ సేన జిల్లా, మండల నాయకులు ఏటూరునాగారం ఐటీడీఏ సమీపంలోని గిరిజన సంక్షేమ గురుకుల స్పోర్ట్స్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎట్టి విద్యాసాగర్ మాట్లాడుతూ ఐటీడీఏ కార్యాలయానికి సమీపంలోనే ఉన్న స్పోర్ట్స్ పాఠశాలలో విద్యార్థులకు పూర్తి స్థాయిలో మరుగుదొడ్ల సౌకర్యం లేదని అన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇది వారి ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. పాఠశాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి పరిసరాలు అధ్వానంగా మారాయని, ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థుల భద్రతపై ఆందోళన నెలకొందని తెలిపారు. పాఠశాలలో నిఘా కెమెరాలు లేకపోవడం కూడా నిర్వహణలో నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. పేరుకే స్పోర్ట్స్ పాఠశాలగా ఉన్నప్పటికీ కనీస ఆటస్థలం, క్రీడా పరికరాలు అందుబాటులో లేవని ఆరోపించారు. విద్యార్థుల కోసం 400 మీటర్ల ట్రాక్ ఏర్పాటు చేయాల్సి ఉందని, ఆటస్థలం, క్రీడా సామగ్రి లేకపోవడంతో క్రీడల్లో ప్రతిభను పెంపొందించుకునే అవకాశం దెబ్బతింటోందన్నారు. అలాగే విద్యార్థులకు సరైన సమతుల్య ఆహారం అందడం లేదని వారు తమ దృష్టికి తీసుకొచ్చారని విద్యాసాగర్ తెలిపారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయానికి సమీపంలోనే పాఠశాల ఉన్నప్పటికీ సమస్యల పరిష్కారంపై తగిన దృష్టి సారించకపోవడం బాధాకరమన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు మెరుగైన విద్య, వసతి, క్రీడా సదుపాయాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆదివాసీ నవనిర్మాణ సేన ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వాజేడు మండల అధ్యక్షులు మోడెం నాగరాజు, సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్, తలండి ప్రసాద్, తొర్రెం సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకు విద్యారంగంలో అరుదైన గౌరవం





వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి): విద్యారంగంలో ఇల్లంద గ్రామం మరోసారి ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఒకే గ్రామానికి చెందిన నలుగురు ఉపాధ్యాయులు ఒకేసారి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపిక కావడం విశేషంగా నిలిచింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా వారు పురస్కారాలు అందుకున్నారు. ఇల్లంద గ్రామానికి చెందిన నకరికంటి వసంత రవీందర్, మానుక వెంకటేశం, తాళ్లపల్లి మంజుల రాజు, బూర అనితలత రాజు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అంకితభావంతో పనిచేయడం, బోధనలో ప్రతిభ కనబరచడం, విద్యార్థుల్లో సృజనాత్మక తను పెంపొందించేందుకు చేసిన కృషి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని వీరిని అవార్డులకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

★ ఒకే గ్రామం.. నలుగురు అవార్డు విజేతలు

సాధారణంగా ఒక గ్రామం నుంచి ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకోవడం అరుదు. అలాంటిది ఇల్లంద గ్రామం నుంచి ఒకేసారి నలుగురు జిల్లా స్థాయి అవార్డులు అందుకోవడంతో గ్రామానికి విద్యారంగంలో ప్రత్యేక గౌరవం దక్కింది. పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులను గ్రామస్థులు, విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు, వివిధ సంఘాల ప్రతినిధులు అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం నిబద్ధతతో పనిచేసే ఉపాధ్యాయులకు లభించిన ఈ గౌరవం మరెందరో ఉపాధ్యాయులకు స్ఫూర్తినిస్తుందని వారు పేర్కొన్నారు. ఒకే గ్రామానికి చెందిన నలుగురు ఉపాధ్యాయులు జిల్లా స్థాయిలో సత్కారం అందుకోవడం ఇల్లంద గ్రామానికి గర్వకారణమని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543
Email:nityamnigha.acs@gmail.com

Nityam Nigha 06.09.26_Layout 1 9/6/2026 8:21 AM Page 9

చీకట్లో వర్ధన్నపేట మండలం !



వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 5 (నిత్యం నిఘా ప్రతినిధి) : వర్ధన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో రాత్రివేళల్లో తరచూ విద్యుత్ సరఫరా నిలిచి పోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పగటిపూట మాత్రమే కాకుండా రాత్రి సమయంలోనూ గంటల తరబడి కరెంటు నిలిచి పోవడంతో గ్రామాలు చీకట్లో మగ్గుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఉక్కపోత భరిం చలేక చిన్నారులు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారని గ్రామస్థులు చెబు తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు చదువుకునే సమయంలో విద్యుత్ కోతలు విధించడంతో వారి చదువులకు ఆటంకం కలుగుతోందని పేర్కొంటు న్నారు.

అధికారుల నిర్లక్ష్యమేనా?

విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నప్పటికీ అధికా రులు ముందస్తు సమాచారం ఇవ్వడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొం దని, అత్యవసర సమయాల్లోనూ విద్యుత్ అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. “బిల్లులు మాత్రం సమయానికి వసూలు చేస్తున్నారు.. విద్యుత్ మాత్రం నిరంతరాయంగా ఇవ్వడం లేదు” అంటూ పలువురు వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో విద్యుత్ కోతలను తగ్గించి, ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని వర్ధన్నపేట మండలంలోని పలు గ్రామాల ప్రజలు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.

కోనారెడ్డి చెరువుకు నీరు.. రైతులకు ఊరట

- ఎమ్మెల్యే నాగరాజు ఆదేశాలతో తూములు ఎత్తిన అధికారులు

- పంటలను కాపాడుకోవాలని రైతులకు సూచన



వరంగల్ / వర్ధన్నపేట, సెప్టెంబర్ 5 (నిత్యం నిఘా ప్రతినిధి) : వర్షాలు ఆశించిన స్థాయిలో కురవక వరినాట్లు వేసి సాగునీటి కోసం ఎదురుచూ స్తున్న కోనారెడ్డి చెరువు ఆయకట్టు రైతులకు ఊరట లభించింది. రైతుల సాగునీటి సమస్యను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దృష్టికి తీసుకె ళ్లగా, ఆయన ఆదేశాలతో సంబంధిత అధికారులు స్పందించి చెరువు తూముల ద్వారా సాగునీటిని విడుదల చేశారు. మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈగ దామోదర్ తూముల వద్దకు చేరుకుని నీటి విడుదలను పరిశీలించారు. సమయానికి సాగునీరు అందడంతో వరినాట్లు ఎండిపోయే పరిస్థితి నుంచి బయటపడ తామని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

వర్షాలు తగ్గడంతో అప్రమత్తంగా ఉండాలి

వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సాగునీటి విషయంలో రైతులు అప్రమ త్తంగా ఉండాలని నాయకులు సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో చెరువులో అందుబాటులో ఉన్న నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకుని పంటలను కాపాడుకోవాలని కోరారు. రైతుల ఇబ్బందులను గుర్తించి వెంటనే నీటి విడుదలకు చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, సంబంధిత అధి కారులకు ఆయకట్టు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐబీ ఏఈ అమర్‌నాథ్, కౌన్సిలర్లు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యక ర్తలు, నీటిపారుదల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

1000 రోజుల కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ వంటావార్పు



ములుగు జిల్లా/ తాడ్వాయి, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్త వుతున్న సందర్భంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం తాడ్వాయి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ తాడ్వాయి మండల అధ్యక్షుడు దండగుల మల్లయ్య, తాడ్వాయి సర్పంచ్ గంట ప్రవళిక–గున్ను ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్య క్రమానికి బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు, ములుగు జిల్లా పార్టీ ఇన్‌చార్జి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, జిల్లా నాయకులు భూక్య జంపన్న ముఖ్య అతిథులుగా హాజ రయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు, జిల్లా ఇన్‌చార్జి బడే నాగజ్యోతి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు, పలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలన ప్రజలకు నిరాశను మిగిల్చిందని ఆరో పించారు. వృద్ధులకు రూ.4 వేల పింఛన్, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్, మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం వంటి హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి వంటి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించు కోకపోవడంతోనే వంటావార్పు వంటి వినూత్న నిరసన కార్య క్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ములుగు జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు దిడ్డి మోహన్‌రావు, మాజీ జడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ దుర్గం రమణయ్య, మాజీ మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ రేగ నరసయ్య, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇందారపు లాలయ్య, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు ‘సర్వేపల్లి’ స్ఫూర్తి



వరంగల్/ పైడిపల్లి, సెప్టెంబర్ 5 (నిత్యం నిఘా ప్రతినిధి): విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపడంతో పాటు మహనీయుల ఆశయాలను భవిష్యత్ తరాలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో 3వ డివిజన్ పైడిప ల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కాంస్య విగ్రహాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శనివారం ఘనంగా ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం ప్రతి విద్యార్థికి ఆదర్శప్రాయమన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని సూచించారు. ఒక గొప్ప ఉపాధ్యాయుడు తరగతి గదిలోని విద్యార్థులనే కాకుండా యావత్ దేశ భవిష్యత్‌ను ప్రభావితం చేయగలడని రాధాకృష్ణన్ జీవితం నిరూపించిందన్నారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖ రాలను అధిరోహించాలంటే క్రమశిక్షణ, నిరంతర కృషి, పట్టుదల ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమాజాన్ని ముందుకు నడిపిం చడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, వారు భావిత రాలకు మార్గదర్శకులుగా నిలుస్తారని అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని కేవలం ఒక విగ్రహంగా కాకుండా విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపే ప్రతీకగా భావించాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జున్ను శిభారాణి అనిల్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ బుద్ధ పెద్దన్న, సీనియర్ నాయకులు బిజిలి సంపత్, డివిజన్ ముఖ్య నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కటాఫ్ డేట్ తీసేసి అర్హులైన బీడీ కార్మికులందరికీ చేయూత పెన్షన్ ఇవ్వాలి

- **తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రమేష్ ల డిమాండ్**





నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, సెప్టెంబర్ 05 (నిత్యం నిఘా ప్రతినిధి): ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం కటాఫ్ డేట్ తీసేసి అర్హులైన బీడీ కార్మికులందరికీ చేయూత పెన్షన్ ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగడి బజార్ నుండి నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు శనివారం నాడు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిమాండ్స్ తో కూడిన వినతి పత్రంను తహసీల్దార్ కు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రమేష్ మాట్లాడుతు రాష్ట్రంలో ఏడు లక్షల 50 వేల మంది బీడీ కార్మికులు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 1,50,000 మంది బీడీ కార్మికులు ఉన్నారని. చాలీచాలని కూలితో దినదిన గండముగా దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారు. వ్యవసాయ రంగం తర్వాత బీడీ పరిశ్రమని రాష్ట్రంలో అతిపెద్ద పరిశ్రమగా ఉన్న దన్నారు. పాలకవర్గాలు అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ముందు మాత్రమే హామీ ఇచ్చి వారి ఓట్ల దుల్పు కొని వీరికి ఎగనాగం పెడు తున్నారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కలరస్తూ అనేక హక్కులను కాదరాచారన్నారు. మోడీ కార్మిక వర్గ వ్యతిరేక విధానాల వల్ల కార్మికులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు అని అన్నారు యాజమాన్యం బీడీ కార్మికులకు అనేక చట్టాలను నిరాహాటంగా ఉల్లంఘిస్తున్న ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు, గతంలో కేసీఆర్ ప్రభుత్వం బీడీ కార్మికులకు అందరికీ పెన్షన్ జీవనపుతిస్తామని హామీ ఇచ్చి తర్వాత కట్ ఆఫ్ డేటు అనేది పెట్టి బీడీ కార్మికులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు దీనివల్ల జీవనభృతికి నోచుకోకుండా ఉన్నారన్నారు. ఎన్నికల ముందు తమరు ఇట్టి కేసీఆర్ విధానాలను తప్పుపడుతూ మీరు అధికారంలోకి రాగానే బీడీ కార్మికులకు 28-02-2014. విధించడం వల్ల వేలాది మంది బీడీ కార్మికుల నోట్లో మన్నుగొట్టినట్లయితే పెన్షన్ రాకుండా అనరులుగా గుర్తించబడ్డార న్నరని మీరు అధికారంలోకి రాగానే కటాఫ్ డేట్ తీసేసి అర్హులైన ప్రతి బీడీ కార్మికురాలికి చేయూత పెన్షన్ ద్వారా పెన్షన్ అందజేస్తా నని పాతవారికి 4016 ఇస్తానని హామీ ఇంచి విస్మరించడం సోషనీయం అన్నారు. ప్రస్తుతం మృతులతో పాటు దివ్యాంగులు తదితరులకు పెన్షన్ దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చి బీడీ కార్మి కులకు ఇవ్వకపోవడం బీడీ కార్మికుల పోట్టగొట్టటమేనన్నారు. అన్నామో రామచంద్ర అంటూ బతుకుతున్న బీడీ కార్మికులకు తక్షణమే చేయుట పెన్షన్ ద్వారా ప్రతి ఒక్క కార్మికురాలికి ఇవ్వాల్సిన అవసరం ఉందని అనడు డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా కార్మికులు ఇట్టి సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారని మీరి సమస్య ను అర్థం చేసుకొని తక్షణమే వీరికి పెన్షన్ ఇవ్వాలి. లేకపోతే కార్మికులతోని పెద్ద ఎత్తున ర్యాలీలు ధర్నాలు చేపట్టి ఆందోళన కార్యక్రమాలు చేపడతాం అని వారు హేచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు K రాజేశ్వర్ అధ్యక్షత వహించి మాట్లాగా, తెలంగాణ ప్రగశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు వి సత్తేమ్మ లు, రాష్ట్ర నాయకురాలు పి రమలు ప్రసంగించ్చారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ కిశోర్, ఏఐయుకెఎస్ జిల్లా ప్రధానకా ర్యదర్శి ఆర్మూర్ డివిజన్ ప్రధానకార్యదర్శి ఆర్ దామోదర్, ఏపికె ఎంఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఉపాధ్యక్షులు బి కిషోర్, POW డివిజన్ కార్యదర్శి ఆర్ పుష్పలత, డివిజన్ నాయకులు బి లావణ్య, ఇ జమున, జీ ప్రవీన, ఏఐయుకెఎస్ నాయకులు జీ బబ్లు, ఎల్ గోపి, జిపి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఓ ఆశన్న, నాయకులు ఎస్ విలాస్ తదితరులు పాల్గొన్నారు.